## పది పరీక్షలకు 163 సెక్షన్ అమలు

ఉట్నూర్, మార్చి 1: పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో ఈ నెల 5వ తేదీ నుంచి 25 వరకు ఉట్నూర్ మండలంలో బీఎన్ఎస్ఎస్ కొత్త చట్టం ప్రకారం 163 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఉన్నందున ఈ సెక్షన్ అమలవుతుందని పేర్కొన్నారు. కావున మండలంలోని ప్రజలు గమనించాలని కోరారు. అనుమతి లేనిదే గుంపులుగా ఉండడం, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, అలాగే శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులు చొరవ చూపాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

ఇచ్చోడ, మార్చి 1: ఆదిలాబాద్ జిలా ఇచ్చోడలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే, ఆదిలాబాద్ డీబీసీఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 80 మంది విద్యార్థులను పరీక్షించి 76 మందికి కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఫోన్లు, టీవీలు ఎక్కువ సేపు చూడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ బీ నరేశ్, రిమ్స్ డాక్టర్ సౌమ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మనస్సు ప్రశాంతత

నార్నూర్, మార్చి 1 : ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని భీంపూర్ హనుమందిర్‌లో నిర్వహించిన భాగవత్ కథ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్, జాదవ్ మోహన్ మహారాజ్, నాయకులు నారాయణనాయక్, గులాబ్ మహారాజ్, దేవీదాస్, సంజు, గంగారాంనాయక్, బాలాజీ, శ్యామ్‌రావ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల కోసం ఉద్యమించాలి

ఎదులాపురం, మార్చి 1 : భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు రాజు అన్నారు. ఈ నెల 11వ తేదీన ఆదిలాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే మహాసభ జయప్రదం కోసం శనివారం కార్మికుల అడ్డల వద్ద ప్రచారం చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించి హక్కుల సాధన కోసం కార్యాచరణ రూపొందించడానికి ఈ నెల 11వ తేదీన నిర్వహించే జిల్లా మహాసభలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వరాదు

దస్తురాబాద్, మార్చి 1 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వరాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో శనివారం మండల భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ సంఘంలో 100 మంది చేరారు. కాగా వీరికి బొమ్మెన సురేశ్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాకేశ్, కార్యదర్శి జగన్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదం సంభవిస్తే జాగ్రత్తలు తీసుకోవాలి

ముథోల్, మార్చి 1 : అగ్ని ప్రమాదం సంభవిస్తే పలు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ ఎస్ఐ రవి అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా ముథోల్‌లోని శిశు మందిర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక దళ సేవలను విద్యార్థులకు వివరించారు. పదో తరగతి పరీక్షల విషయంలో ఆందోళన చెందకూడదన్నారు. నూటికి నూరు శాతం లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి దేవేందర్, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

నర్సాపూర్(జీ), మార్చి 1 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని ఎస్టీ వసతి గృహంలో వైద్యులు ప్రమోద్ చంద్ర, ప్రియాంక, రాజశేఖర్ రెడ్డి శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హేమ, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

దిలావర్‌పూర్, మార్చి 1: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌కు చెందిన బొంబాయి రాకేశ్ శివరాత్రి నాడు దైవదర్శనానికి వెళ్తుండగా బైక్ ఆటో ఢీ కొన్న ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. రాకేశ్‌ను నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సకు తీసుకెళ్లారు. అందుకు గాను రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. విరిది పేద కుటుంబం కావడంతో దిలావర్‌పూర్ జిల్లా పరిషత సెకండరీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం తమ వంతుగా శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

## యువతిని అప్పగించాలని ఆందోళన

బోథ్, మార్చి 1: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన యువతిని అప్పగించాలని కోరుతూ శనివారం బీజేపీ, హిందు వాహిని నాయకులు ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఓ వర్గానికి చెందిన యువకుడు మరో వర్గానికి చెందిన యువతిని మాయ మాటలు చెప్పి పెండ్లి చేసుకున్నాడు. తల్లిదండ్రుల అనుమతి లేకుండానే పెండ్లి చేసుకోవడంతో యువతి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగి బ్రహ్మానందం, హిందు వాహిని నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆందోళన చేపట్టారు. యువతిని అప్పగించాలని నినాదాలు చేశారు. పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వినిపించుకోలేదు. ఎట్టకేలకు యువతి తిరిగి రావడంతో ఆమెను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

## ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం, మార్చి 1: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఏ రాంరెడ్డి ఫిబ్రవరి 28వ తేదీన ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్‌లో ఉన్న బామ్మర్ది జైపాల్ రెడ్డి ఇంటికి వచ్చాడు. ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట పార్కింగ్ చేశాడు. శనివారం ఉదయం ఇంటి బయట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం కనిపించలేదు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## బురదలో బాల్యం



నీటి కుంటలో చేపలు పడుతున్న చిన్నారులు

ఆదిలాబాద్ జిల్లాలోని ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లల చదువుల కోసం విద్యాశాఖ అధికారులు పాఠశాలలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, అలాంటి చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. దీంతో చిన్నారులు ఆటలు ఆడుకోవడంతో పాటు నీటి కుంటల్లో చేపలు పడుతున్నారు. శనివారం మావల మండలం బట్టిసావర్గాం ఇటుకబట్టీ సమీపంలో కార్మికుల పిల్లలు నీటి కుంటలో చేపలు పడుతున్న దృశ్యం నమస్తే కెమెరాకు చిక్కింది.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, మార్చి 1

## ఎస్సీ వర్గీకరణలో మాలలకు న్యాయం జరిగే విధంగా చూడండి



మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

ఎదులాపురం, మార్చి 1 : ఆదిలాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం నాయకులు శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావును కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఎస్సీ వర్గీకరణ అంశంలో మాలలకు అన్యాయం జరిగే విధంగా ఉందని పేర్కొన్నారు. వర్గీకరణలో మాలలకు న్యాయం జరిగే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తామని మాజీ మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఇక్కడ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, రాష్ట్ర కన్వీనర్ బేర దేవన్న, రాష్ట్ర కో కన్వీనర్లు సింగరి అశోక్, పాశం రాఘవేంద్ర, మేదరి స్వామి సోమన్న, జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ ఉన్నారు.

# దివ్యాంగులకు యూడీఐడీ నంబర్ జనరేట్ చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి1: దివ్యాంగులకు యూడీఐడీ నంబర్ జనరేట్ చేయాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మల్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఈవో మాట్లాడుతూ దివ్యాంగులకు సదరమ్ ధృవీకరణ పత్రాల కొరకు దరఖాస్తు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధృవీకరణ పత్రం కొరకు మీసేవ, వీఎల్ఈ కేంద్రాలను ఆశ్రయించేవారని ఇప్పుడు వీటితోపాటు యూడీఐడీ పోర్టల్, సొంత మొబైల్ ద్వారా రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. 21 రకాల వైకల్యం ఉన్నవారు యూడీఐడీ కార్డును పొందవచ్చన్నారు. నూతనంగా యూడీఐడీ కార్డుల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎదులాపురం, మార్చి 1 : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా శనివారం ఆదిలాబాద్‌లోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయం కుమ్రం భీం భవనంలో ఈ నెల 4వ తేదీన జిల్లా రాష్ట్ర కార్మిక శాఖ కార్యాలయాల ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. 4వ తేదీన జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల భవన ,ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింగ్, దేవీదాస్, జిల్లా నాయకులు సుభాష్, లక్ష్మణ్, దేవేందర్ పాల్గొన్నారు.

# ఘనంగా సైన్స్ దినోత్సవం

సారంగాపూర్, మార్చి 1: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని జామ్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఆగస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ ప్రదర్శనలు ప్రదర్శించారు. విద్యార్థినులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఇందులో ఆగస్య ఫౌండేషన్ ఇగ్నేటర్లు సురేశ్, రాజ్‌కుమార్, ఎస్‌వో అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సారంగాపూర్: విద్యార్థినుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు

**భాష్యం పాఠశాలలో ..**



నిర్మల్‌అర్బన్: భాష్యం పాఠశాలలో..

నిర్మల్ అర్బన్, మార్చి 1: నిర్మల్‌లోని భాష్యం పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆవిష్కార్ 2025ను ఘనంగా నిర్వహించారు. ఈ సైన్స్‌ఫెయిర్‌కు ఎంఈవో నాగేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు. అద్భుతమైన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు అవినాశ్, చంద్రిక, అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ ప్రియా కపిల్, కరస్పాండెంట్ కౌశిక్, స్వప్న పండరి, ఉదయ్, ఉమేశ్, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ

నిర్మల్ అర్బన్, మార్చి 1: నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎల్ దేవరావు, ఏఎస్ఐ లక్ష్మారెడ్డిని శనివారం ఎస్పీ జానకీషర్మిల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. సుమారు 36 సంవత్సరాలుగా సర్వీస్ పూర్తి చేసి వారు అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏవో యూనిస్ పాల్గొన్నారు.

## ఉద్యోగాల పేరిట మోసం: కేసు నమోదు

నిర్మల్ అర్బన్, మార్చి 1: నిర్మల్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనలో శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో మోసపోయినట్లు గుర్తించిన పలువురు బాధితులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పట్టణానికి చెందిన శ్రీజ తండ్రి సూత్రధారి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## రంజాన్ మాసంలో గంట ముందు పంపించాలి

ఎదులాపురం, మార్చి 1: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లిం సిబ్బందిని ఒక గంట ముందు పంపించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ రిమ్స్ సూపర్‌వైజర్ రవికి వినతిపత్రం అందజేశారు. రిమ్స్, సూపర్ స్పెషలిటీ దవాఖానల్లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ ముస్లిం సిబ్బందికి రంజాన్ మాసంలో గంట ముందుగా పంపించాలని కోరారు.

## ప్రభుత్వ దవాఖానపై చిన్న చూపు

దస్తురాబాద్, మార్చి 1 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంపై పట్టింపు కరువైంది. ప్రభుత్వ దవాఖానపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ప్రభుత్వ దవాఖాన రెండు సార్లు ఎన్‌క్వాస్‌కి ఎంపికైంది. రోజుకు దాదాపు 100పైగా ఓపీలు వస్తుంటాయి. అభివృద్ధి మాత్రం శూన్యం. జిల్లా వైద్యాధికారులు ఎన్నో సార్లు వస్తున్నారు వెళ్తున్నారు కానీ ఆ సమస్యను పరిష్కరించడం లేదు. నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రహరీ కూలీ పోవడంతో రక్షణ కరువైంది. దీంతో పశువులు, కుక్కలు, పందులు లోపలికి రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అక్కడికి వచ్చిన రోగులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైన దృష్టి సారించి కూలీ పోయిన ప్రహరీ స్థానంలో నూతన గోడ కట్టించాలని కోరుతున్నారు. ప్రభుత్వ దవాఖానను అభివృద్ధి చేసి రోగులు, ప్రజలకు వైద్యంపై భరోసా కల్పించాలని అంటున్నారు.



దస్తురాబాద్ : వర్షానికి కూలి పోయిన గోడ

## విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి



నిర్మల్‌అర్బన్: నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి 1: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. నిర్మల్‌లోని చాణక్య ఉన్నత పాఠశాల తరంగ్–2025 కార్యక్రమానికి ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వర్ రావు, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, జిల్లా పరీక్షల విభాగం ఇన్‌చార్జి భానుమూర్తి, డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, ప్రభాకర్, శంకర్, హరీష్, చంద్రాగౌడ్ పాల్గొన్నారు.

## భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి



దిలావర్‌పూర్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దిలావర్‌పూర్ మార్చి 1 : విద్యార్థులు పది పరీక్షలు అంటే భయం వీడి పట్టుదలతో చదువుకోవాలని ప్రిన్సిపాల్ అపర్ణ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు పలువురిని అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, విద్యార్థులు వ్యాయమ ఉపాధ్యాయురాలు జయారెడ్డి, అకౌంటెంట్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 1: మార్చి 1 నుంచి మార్చి 31 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆవును వెతకబోయి ఒకరి మృతి

భైంసాటౌన్, మార్చి 1 : ఆవును వెతకబోయి ఒకరు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని వానల్‌పాడ్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దండ్ల నడిపి సాయన్న(64) తన ఆవును వెతకడానికి పొరుగు గ్రామమైన వాటోలి వాగులో వెతుకుతుండగా గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీళ్లను గేటు ద్వారా వదలడంతో ఏటు వెళ్లాలో అని ఆలోచించుకునే లోపే నీటి ప్రవాహానికి కొద్ది దూరం వరకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది.మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

## కొనసాగుతున్న విస్తృత ఉపన్యాసం

ఎదులాపురం, మార్చి 1 :ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్, కామర్స్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాసాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే శనివారం విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు, రచయిత, చిత్రకారుడు,ఆకాశవాణి వ్యాఖ్యాత సామల రాజవర్ధన్ తెలుగులో భాషా దోషాలు అనే అంశంను విద్యార్థులకు వివరించారు. అ తర్వాత బమ్మెర పోతన భాగవతం గజేంద్ర మోక్షం నుంచి కొన్ని పద్యాలు చెప్పారు. అనంతరం రాజవర్ధన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతీక్ బేగం, సిబ్బంది కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, తెలుగు అధ్యాపకులు రేఖ, నరేశ్, చంద్రకాంత్, కుణాల్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఐటీడీఏ పీవో, అధ్యాపకులు

ఉట్నూర్, మార్చి 1: హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీన నిర్వహించే గురుకుల జాతీయ స్థాయి సైన్స్‌ఫెయిర్ పోస్టర్‌ను శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఈ సైన్స్‌ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ హరిత, వైస్ ప్రిన్సిపాల్ కొరిమి ప్రత్యూష, అధ్యాపకులు మానస, హరిక పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలవాలి



పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఎదులాపురం, మార్చి 1 : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద ముస్లిం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే ఉద్దేశ్యంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు సయ్యద్ ముబాషిర్ అహ్మద్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని టీఎన్జీవో గార్డెన్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరుపేదలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, ముఫీ ముస్తాఫా, సఫాబైతుల్ మాల్ ఉపాధ్యక్షుడు హఫీజ్ బసీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి హఫీజ్ ఖాజీమ్, మంజూర్ అహ్మద్, అబ్దుల్ అజీజ్, నజీర్, అమ్జద్ పాల్గొన్నారు.

## వసతి గృహం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జాదవ్ అంబాజీ

నర్సాపూర్(జీ), మార్చి 1 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని ప్రభుత్వ ఎస్టీ వసతి గృహన్ని శనివారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జాదవ్ అంబాజీ తనిఖీ చేశారు. హాస్టల్‌లో సమకూరుస్తున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రామరావు, ఎంఎన్‌వో సాయన్న, స్టోలర్ ఆఫీసర్ ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు ముత్యం ఉన్నారు.

## డిజిటల్ క్రాప్‌బుకింగ్ ప్రారంభం

లక్ష్మణచాంద, మార్చి 1: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ గ్రామంలో శనివారం డిజిటల్ క్రాప్‌బుకింగ్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వసంత్ రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ క్రాప్‌బుకింగ్‌లో భాగంగా ప్రతి సర్వే నంబర్‌లో 25 మీటర్ల దూరంలోని క్రాప్‌ను ఫొటోతీసి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో శరణ్య, రైతులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

దిలావర్‌పూర్, మార్చి 1 : రైతులను మభ్యపెట్టి ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలోని రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఫర్టిలైజర్ దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వద్ద ఎరువులు, ఇతర క్రిమిసంహారక మందులు ఇచ్చిన డబ్బులు తీసుకోవడానికి సరిపడ రసీదు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా యూరియపై కొరత సృష్టించవద్దని సూచించారు. ప్రతి ఫర్టిలైజర్ దుకాణం వద్ద ఎరువుల వివరాలు విధిగా నోటీస్‌బోర్డుపై ఉంచాలని అన్నారు. రైతులను మోసం చేసినట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఇన్పుట్ డీలర్లు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగింత

లక్ష్మణచాంద, మార్చి 1: మతి స్థిమితం లేకుండా లక్ష్మణచాందలో ఒక చిన్నబాబును ఎత్తుకొని వెళ్తున్న వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ సుమలత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన వంశీ(32) అతడు కొద్ది రోజులుగా మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో లక్ష్మణచాంద బస్టాండ్ సమీపంలో ఒక చిన్న బాబును తీసుకుని వెళ్తుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కానిస్టేబుళ్లు భూమన్న, సంతోష్ అతడిని పట్టుకుని విచారించి, అతడి గురించి తెలుసుకున్నారు. తిర్‌పెల్లి గ్రామానికి చెందిన అతని చెల్లెలు చిట్టిమల్ల రుచితకు అప్పగించారు. అతను పట్టుకెళ్తున్న చిన్నబాబును పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

## వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

నర్సాపూర్(జీ), మార్చి 1 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ) మండలంలోని నసీరాబాద్ గ్రామంలో మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, శిశువులు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మేరకు టీకాలు వేయించుకోవాలని వైద్య సిబ్బంది నైనా రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్స్ దుర్గాభవాని సూచించారు.